నవతెలంగాణ
నమ్మిక వెలుగు దీపదర్శి
మెదక్
1
గురువారం | 12 డిసెంబర్ 2024 | www.navatelangana.com

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న మంత్రి



నవతెలంగాణ-సిద్ధిపేట

పట్టణంలోని రేణుక ఎల్లమ్మను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించి, మంత్రికి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు



నవతెలంగాణ-సంగారెడ్డి

కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యులు ఆర్ సత్యనారాయణను మాజీ మంత్రి హరీశ్ రావు బుధవారం పరామర్శించారు. సంగారెడ్డి పట్టణంలోని సత్యనారాయణ నివాసానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి వెళ్లి సత్యనారాయణను పరామర్శించారు. సత్యనారాయణ యోగక్షేమాల గురించి, అందిస్తున్న చికిత్స గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. వారితోపాటు రాజేందర్, శివరాజ్ పాటిల్, మనోహర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

భేల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్





నవతెలంగాణ-రామచంద్రాపురం:

రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్‌లో బుధవారం ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఎన్‌డిఆర్ ఎఫ్, సిఐఎస్‌ఎఫ్ భేల్, బీడీఎల్, బానూర్, తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ పటాన్‌చెరు, హ్యూమన్ రిసోర్స్, ఆరోగ్య భద్రత, పర్యావరణ విభాగాలు సంయుక్తంగా ఈ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారీ అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, భవనాలు కూలిపోయి సిబ్బంది చిక్కుకోవడం వంటి విపత్తుల సమయంలో ఆకస్మిక పరిస్థితులు, రెస్క్యూ ఆపరేషన్లు, సిబ్బందిని సురక్షితంగా తరలించడంపై ఈ మాక్ డ్రిల్ అవగాహన కల్పించింది. ఇది ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్స్‌కు అత్యవసర సంసిద్ధతను మెరుగుపరచడమే కాకుండా ప్రాణాపాయ సంఘటనల నుంచి బయటపడేందుకు ఎంతగానో దోహద పడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భేల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బి రాజా, జనరల్ మేనేజర్లు విజయసాగర్, శ్రీనివాసరావు అధికారులు అరవింద్ కుమార్, మంజీత్ కుమార్, బండారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అసిస్టెంట్ కమాండర్ దామోదర్ సింగ్ నేతృత్వంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంతగానో ప్రశంసించారు.

పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ దాడులు

-మొబైల్ ఫోన్స్, నగదు స్వాధీనం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని నాచారం గ్రామ శివారులో విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట స్థావరాల్లో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా ఒకరు పరారీలో ఉన్నారు. ఐదుగురు వ్యక్తుల వద్ద రూ.20,450 నగదు, నాలుగు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్, గౌరారం పోలీసులు మాట్లాడుతూ.. ఫామ్ హౌస్‌ల్లో, ఇండ్లలో, బహిరంగ ప్రదేశాల్లో జూదం, పేకాట ఆడినట్లు తెలిస్తే టాస్క్ ఫోర్స్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చట్ట వ్యతిరేకమైన పనులు చేసిన, జూదం ఆడిన, నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-టేక్మాల్

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోరంపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 12 45 గంటలకు చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎల్లంపల్లి ప్రభాకర్ భార్య లావణ్య (38) ఇంట్లో ఎవరు లేని సమయం చూసి దూలానికి చీరతో ఉరి వేసుకొని మృతి చెందారు. మృతురాలి అన్న కాశీనాథం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాశీనాథం తెలిపిన వివరాల ప్రకారం తన బావ లావణ్య భర్త ప్రభాకర్ ఫోన్ చేసి మీ చెల్లెలు ఉరి వేసుకుందని ఆసుపత్రికి తీసుకొని వస్తున్నామని ఫోన్ చేసి చెప్పారన్నారు. ఈ విషయం తెలుసుకున్న కాశీనాథం నిజం తెలుసుకోవడం కోసం కోరంపల్లి గ్రామానికి బయలుదేరి రావడంతో మార్గమధ్యలో , ఎదురుపడిన తన చెల్లెలు మృతదేహాన్ని తీక్షణంగా పరీక్షించడంతో అనుమానం వచ్చిందని, వెంటనే మృతదేహాన్ని తీసుకొని కోరంపల్లి గ్రామానికి చెల్లెలు ఉరివేసుకున్న ఇంటికి వెళ్లి ఇంటి పరిసరాలను తీక్షణంగా పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం తన చెల్లెలు లావణ్య వాడిన మొబైల్ ఫోను పరిశీలించగా, మంగళవారం 12 గంటల ప్రాంతంలో 9553330589 ఫోన్ నెంబర్ కు వీడియో కాల్ మాట్లాడుతూ దూలానికి చీరతో ఉరి వేసుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ ఫోన్ నెంబర్ ఉన్న వ్యక్తి పై అనుమానాలు ఉన్నాయని అతనిపై చర్య తీసుకోవాలని మృతురాలి అన్న విశ్వనాథం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ తుక్కయ్య కేసు నమోదు చేసుకొని పంచనామ నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

పోలీసు అవుట్ పోస్టును సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్

నాగల్ గిద్ద పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పోలీసు అవుట్ పోస్ట్ ను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించి, అక్కడ విధులలో ఉన్నటువంటి సిబ్బందికి ఉండాల్సిన కనీస వసతులను బుధవారం పరిశీలించారు. అదేవిధంగా నాగల్ గిద్ద పోలీసు స్టేషన్ నందు సిబ్బంది నివాసం ఉండటానికి ఏర్పాటు చేసిన బ్యారక్స్‌ను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత యస్.హెచ్.ఒలదేనన్నారు. సిబ్బంది ఎవ్వరూ కూడా దూర ప్రాంతాల నుండి ప్రయాణాలు చేయకూడదని, తమకు కేటాయించిన పోస్టింగ్ హెడ్ క్వార్టర్ నందు 24ల7 అందుబాటులో ఉండాలని సూచించారు. అవుట్ పోస్ట్ నందు విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వచ్చి, పోయో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, గుట్కా, సిగరెట్లు మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి విలులేదని అన్నారు. అనంతరం నారాయణ్ ఖేడ్ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదిన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ నందు సబ్-డివిజన్ నుండి వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీ కుదిరచేలా చూడాలని యస్.హెచ్.ఒ లకు సూచనలు చేశారు. అనంతరం శిక్షణలో భాగంగా నారాయణఖేడ్ సబ్-డివిజన్ కు వచ్చిన ట్రైనీ ఎస్ఐలతో మాట్లాడుతూ.. బేసిక్ ట్రైనింగ్‌లో ప్రతి విషయాన్ని ప్రాక్టికల్‌గా దగ్గరి నుండి చూసి నేర్చుకోవడానికి వీలుంటుందని, ఏ కేసులో ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, సీనియర్ అధికారుల నుండి ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవచ్చు అన్నారు. ప్రతి ఇంక్వెస్ట్, 100 డయల్ కాల్స్ కు ప్రత్యేకంగా వెళ్లాలని ట్రైనీ ఎస్ఐ లకు సూచనలు చేశారు. ఎలాంటి సందేహాలున్న అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులను అడిగి తెలుసుకోవాలని, అధికారుల సలహాలు చూచనాలు పాటిస్తూ శిక్షణను సమర్ధవంతంగా పూర్తి చేసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎవరైన మాదక ద్రవ్యాలు తీసుకుంటునా, గంజాయి సాగు చేసినా, అక్రమ రవాణా చేసినట్లు గుర్తించినయడల ఎస్-ఎన్‌ఏబి (సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్) నెంబర్ 8712656777 కు కాల్ చేసి గాని వాట్స్ ఆప్ ద్వారా గాని సమాచారం అందించవలసిందిగా సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీయస్పి వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సబ్-డివిజన్ ఎస్.ఐ.లు ట్రైనీ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు బోజన తాంబూలాలు

నవతెలంగాణ-మెదక్ డెస్క్

ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం రోజు ఉదయం బుడ్డ స్వర్ణలత భాగ్యరాజు స్వామి అయ్యప్ప పూజ హారతి, స్వామి పాదం, భిక్ష, తాంబూలం ఇచ్చి అయ్యప్ప స్వాములతో ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బుడ్డ భాగ్యరాజు స్వామి ఇంట్లో బుధవారం ఉదయం అయ్యప్ప స్వాములకు (భిక్ష) బోజన తాంబూలాలు ఏర్పాటు చేసి ముందుగా అయ్యప్ప స్వామి పూజ, హారతి, కన్నె స్వాములకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందాయిపేట మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత,అయ్యప్ప స్వాములు కుమ్మరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- 14న డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతి కుమారి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్/సంగారెడ్డి/మెదక్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్ 2 పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ అధికారులకు సూచించారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ సంబంధించి చేసిన ఏర్పాట్లను, పాటించాల్సిన నియమాలను టీజీపీఎస్సీ చైర్మెన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ ప్రతి పరీక్ష చాలా కీలకమని, ఎక్కడ ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని చైర్మెన్ కలెక్టర్లను కోరారు. గ్రూప్ 1 , గ్రూప్ 3 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఈ ఏడాది చివరగా గ్రూప్ 2 పరీక్షలను డిసెంబర్ 15,16వ తేదీల్లో 2 సెషన్స్‌ల్లో జరుగుతాయని అన్నారు. గ్రూప్ 2 పరీక్షలలో అభ్యర్థులకు ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్ అందించడం జరుగుతుందని అన్నారు. ఒకరి ఓఎంఆర్ షీట్ మరొకరికి ఇవ్వడానికి వీలు లేదని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల సకాలంలో చేరుకునేలా ముందుగానే విస్తృత ప్రచారం జిల్లాల్లో కల్పించాలన్నారు.

డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం..

డిసెంబర్ 14న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాల్లో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలో 40శాతం డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో వంట గది నిర్వహణ, పిల్లలకు అందించాల్సిన నాణ్యమైన ఆహారం తదితర అంశాలపై స్టాఫ్‌కు అవగాహన కల్పించాలని అన్నారు. డైట్ చార్జీల పెంపు కార్యక్రమంలో మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు ఉన్నతాధికారులు పాల్గొనేలా చూడాలని సీఎస్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ





నవతెలంగాణ-జోగిపేట

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య కుమారుడు రోహిత్, మనిషాల వివాహానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహతో పాటు పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, టీఎస్ ఐసీసీ చైర్ పర్సన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, పిఆర్టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ పాల్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పిఆర్‌టియు ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్ రెడ్డిలతో పాటు పలువురు వివాహ వేడుకలకు హాజరయ్యారు. వీరికి లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి, అందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆకుల రాంబాబు, అందోల్ జోగిపేట 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబులు స్వాగతం పలికారు. అతిధులు నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సంగారెడ్డిలోని ఎల్‌ఎన్ ఫంక్షన్ హాలులో జరిగిన వివాహానికి వారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పీఆర్‌టియు రాష్ట్ర నేతలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నవతెలంగాణ-వట్‌పల్లి

వట్పల్లి మండల పరిధిలోని కేరూర్ గ్రామానికి చెందిన పెద్ద పట్ల శరణ్య వినయ్ గౌడ్ వివాహ వేడుకల్లో మంత్రి దామోదర రాజనర్సింహ సతీ సమేతంగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం పటాన్‌చెరులోని జి.ఎం ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన వివాహ వేడుకలలో పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో మంత్రి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి టీఎస్ ఐసీసీ నిర్మల జగ్గారెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రమేష్ జోషి ఎన్ ఎస్ యుఐ నాయకులు ఖా జా తదితర ప్రముఖులు పాల్గొన్నారు

మోహన్ బాబుపై హత్యా యత్నం కేసు నమోదు చేయాలి

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి!!

నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాదులో జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్ బాబు, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద బుధవారం పెద్ద ఎత్తున జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జి లు ధరించి నిరసన తెలిపారు. తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైజల్ అహ్మద్ పిలుపుమేరకు ఆందోళన చేపట్టామని జిల్లా అధ్యక్షుడు యాదగిరి వివరించారు. .మీడియాను నియంత్రించే హక్కు, దాడి చేసే హక్కు మోహన్ బాబుకుగాని ఇతరులకుగాని లేనేలేదన్నారు. ఇలాంటి దాడుల వల్ల జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తే ..సహించేది లేదని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ విచక్షణ కోల్పోయి వ్యవహరించిన మోహన్ బాబుపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీధి రౌడీల్లాగా ప్రవర్తించిన మోహన్ బాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ సిద్దిక్, సీనియర్ నాయకులు పానుగంటి కృష్ణ, బాల ప్రసాద్ యోగానంద రెడ్డి ,రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, మతిన్ ,డేవిడ్, దండు ప్రభు,నాగరాజు గౌడ్, సునీల్, శ్రీరామ్ శేఖర్, శ్రీనివాస్ , పుట్నాల లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరి ఫ్, సంతోష్ హరి,శివ , కృష్ణ, పవన్ యూసుఫ్, ఆమేర్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో జాతీయ రహదారిపై బైఠాయింపు,

నవతెలంగాణ-పటాన్‌చెరు

మోహన్ బాబు నీ విలనిజం జర్నలిస్టుల పైననా అంటూ పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టులు తీవ్రంగా ధ్వజమెత్తారు. సినీ నటుడు మోహన్ బాబు విచక్షణ కోల్పోయి జర్నలిస్టులపై చేసిన దాడిని పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టు ఐక్యవేదిక ముక్తకంఠంతో ఖండించింది. జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలోని జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పి రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు అబ్దుల్ బాసిత్,రాఘవరెడ్డి, నిరంజన్ తదితర జర్నలిస్టులు మాట్లాడుతూ ఒక సినిమా నటుడుగా, నిర్మాతగా, డైరెక్టర్‌గా, పార్ట్ టైం రాజకీయ వేత్తగా, విద్యా సంస్థల నిర్వాహకుడిగా ఎన్ని పాత్రలు వేసినా తన క్రిమినల్ బుద్ధిని మోహన్ బాబు ఏనాడు వదిలి పెట్టలేదని ధ్వజమెత్తారు. నిజాలను భరించడం ఇష్టం లేకనే టీ.వీ.9 ప్రతినిధిపై నటుడు మోహన్ బాబు వీరావేశంగా దాడి చేయడం దారుణమన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, మోహన్ బాబుపై హత్యా యత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు.



రాజ్యాంగం రక్షణ కోసం దేశ వ్యాప్త ఉద్యమం

25 నుంచి సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు

గొల్లగూడెంలో సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్



నవతెలంగాణ-సదాశివపేట

రాజ్యాంగం రక్షణ కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేపడతామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామంలో సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం నిర్వహించి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ 2025 జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. సీపీఐ(ఎం) దేశంలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మహిళలు, మైనార్టీలు, విద్యార్థులు, యువకుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. భారత రాజ్యాంగం రిజర్వేషన్ల రక్షణ కోసం దేశవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఉద్యమం చేస్తుందన్నారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ అమలు చేయడం లేదన్నారు. రైతులు అనేక పోరాటాలు చేస్తున్నా వారి సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రైతుల డిమాండ్లు పరిష్కరించకుండా నిర్బంధాలు ప్రయోగిస్తుందన్నారు. ఈ మహాసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక తీర్మానాలు చేయడం జరుగుతుందని, మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, నాయకులు పి.అశోక్, టి.అనిల్, మల్లేశం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్ల బాలికపై లైంగిక దాడి

నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణంలో ఓ కాలనికి చెందిన మూడున్నరేళ్ల బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. పట్టణ శివారు పిల్లికొటాల్ డబుల్ బెడూరూమ్ కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ అబ్బాస్ (40) మరో కాలనిలో ఉంటున్న మరదలు ఇంటికి తరచూ వచ్చి పోతుంటాడు. ఈ క్రమంలో పక్కింట్లో ఉండే మూడున్నరేళ్ల బాలికకు చాక్లెట్లు ఇచ్చి లోబరచుకుని పలు మార్లు మరదలు లేని సమయంలో ఆమె ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడేవాడు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు బాధితురాలని భరోసా కేంద్రానికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్య నిర్లక్ష్యం వల్లనే బీమ పరిశ్రమలో ప్రమాదం

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి.
- యాజమాన్యంపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామ శివారులో ఉన్న బీమ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు కృష్ణ బాబు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే చనిపోయాడని, చనిపోయిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కార్మికుని కుటుంబంలో ఒకరికి పర్మనెంట్ ఉద్యోగం కల్పించాలని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. తక్షణమే యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీమా పరిశ్రమలో కార్మికుడు కృష్ణ బాబు మృతి చెందగా, మరో ఇద్దరి కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదం జరిగే తీరు పరిశీలన చేస్తే యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కంపెనీ ప్రారంభం నుంచి పనిచేస్తున్న కృష్ణ బాబు కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత యజమాన్యంపై ఉందన్నారు. కంపెనీలో పని చేసే సందర్భంలో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణించడం ధారుణమన్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయంటే కంపెనీ యాజమాన్యం సరియైన సేఫ్టీ సౌకర్యాలు కల్పించ కపోవడమేనని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ప్రమాదం జరగడానికి పూర్తి బాధ్యత యాజమాన్యానిదేనన్నారు. గాయపడిన ఇద్దరు కార్మికులకు మంచి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించాలన్నారు. వారి ఆరోగ్యం బాగు పడే వరకు ఆస్పత్రి ఖర్చులు మొత్తం యాజమాన్యమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమలలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు రావకపోవడం దుర్మార్గమన్నారు. పరిశ్రమలను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల మరణానికి కారణమైన యాజమాన్యంపై కేసు నమోదు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు లేనియెడల కార్మికులతో కలిసి భవిష్యత్తులో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

వేతనంలో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌజన్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ దోపిడీ చేస్తున్నాడన్నారు. ఉద్యోగం నుంచి తీసివేస్తానని బెదిరిస్తున్నాడని మూడు నెలలుగా వేతనం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పెండింగ్ జీతాలు ఇవ్వాలన్నారు డ్యూటీలో ఉన్న వర్కర్‌కు ప్రమాదం జరిగినా పట్టించుకోవడం లేదని తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం వేతనం చెల్లించాలని ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలని, జనరల్ మెడకల్ హాలిడేస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనం చెల్లించకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, హరి, శ్రావణ్, జయమ్మ, లలిత, లక్ష్మి కిష్టమ్మ శేఖర్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జలమండలి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

జలమండలి ఆధ్వర్యంలో ఓఆర్‌ఆర్ ఫేజ్ 2 పరిధిలో చేపడుతున్న రిజర్వాయర్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎంఎల్ఏ సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో జల మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల ప్రగతిని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రధానంగా బొల్లారం, బీరంగూడ, అమీన్పూర్ తెల్లాపూర్ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో పంపింగ్ పనులు సైతం పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాలుష్య జలాలతో ఇబ్బంది పడుతున్న బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పైపులైన్ల లీకేజీ విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జలమండలి జీఎం సుబ్బారాయుడు, డీజీఎంలు చంద్రశేఖర్, శివకుమార్, ఏఈలు ప్రవీణ్, పూర్ణేశ్వరి, శ్రీనివాస్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, కషాయాల తయారీపై శిక్షణ



నవతెలంగాణ-జహీరాబాద్

సేంద్రియ ఎరువులతో అధిక ఉత్పత్తి సాధ్యమని కె.వికె శాస్త్రవేత్త పగడాల సాయి ప్రియాంక అన్నారు. బుధవారం డీడీఎస్ ఆధ్వర్యంలో కేవీకే సిబ్బంది రేజింతల్, పోట్పల్లి, మెటల్ కుంట, ఎల్గోయ్ మహిళా రైతులకు సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడానికి అనుగుణంగా ఉపయోగపడే ద్రవరూప ఎరువులు, కషాయాలపై క్లుప్తంగా వివరించి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంటకు అవసరమైన పోషకాలను అందించేందుకు డా.పగడాల సాయి ప్రియాంక పంచగవ్య , జీవామృతం తయారీని వాటి ఉపయోగాలను వివరిస్తూ పాల్గొన్న రైతులతో వీటి తయారీ విధానాన్ని చేపట్టారు. డా.ఎన్. స్నేహలత రబీ పంటల్లో వచ్చే చీడపీడలపై అవగాహన కల్పించి వాటి యాజమాన్య పద్ధతులను వివరిస్తూ దశపర్ణి కషాయం , పుల్లటి మజ్జిగ తయారీ విధానాన్ని చూపించారు. ఈ కషాయాలు , ఎరువులు రైతులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. పంట పెట్టుబడి కూడా తగ్గించుకోవచ్చని తెలియజేశారు. మహిళలు ఇంటి వద్దనే ఉండి ఈ సేంద్రియ ఉత్పత్తులు తయారు చేసే చిన్నపాటి కుటీర పరిశ్రమని కూడా ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిడిఎస్ కెవికె శాస్త్రవేత్తలు, సూపర్వైజర్లు కేశమ్మ, బాలన్న, మహిళా రైతులు పాల్గొన్నారు..

జిల్లాకు నవోదయ విద్యాలయం ఏర్పాటుకై కేంద్ర నిర్ణయం పట్ల హర్షణీయం



నవతెలంగాణ-కొండాపూర్

మెదక్ ఉమ్మడి జిల్లా సంగారెడ్డికి జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా కొండాపూర్ మండల్ బిజెపి సెక్రటరీ బి. మల్లేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి,రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, మెదక్ పార్ల మెంట్ సభ్యులు రఘునందన్ రావు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులందరికి అభినందనలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలను తీసుకువచ్చిందన్నారు. అందులో మన సంగారెడ్డి జిల్లాకు కేటాయించడం చాలా ఆనందంగా ఉంది అందుకే వారికి ప్రతేక ధన్యవాదములని పేర్కొన్నారు.

రాజ్యాంగంను చించిన వ్యక్తిపై దేశ ద్రోహం కేసు పెట్టాలి




నవతెలంగాణ-సంగారెడ్డి

మహారాష్ట్ర రాష్ట్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు భారత రాజ్యాంగాన్ని చించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఏ మాణిక్, ప్రధాన కార్యదర్శి అశోక్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని పర్భానిలో ఒక వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు భారత రాజ్యాంగాన్ని చించడాన్ని కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రపంచంలోనే ప్రజాస్వామిక పాలన జరుగుతుందంటే కారణం అంబెద్కర్ రచించిన రాజ్యాంగం గొప్పతనమేనన్నారు. రాజ్యాంగం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవటం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఏర్పడిన్నప్పుడు రాజ్యాంగంపై ప్రమాణం చేసిన నాయకులు తరువాత మర్చిపోతున్నారన్నారు. మనువాదుల కుట్రలో భాగమే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని చించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని సమగ్ర విచారణ జరపాలని, మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షునికి సన్మానం

- టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి



నవతెలంగాణ-కొండాపూర్

కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన చిలకమర్రి అశోక్‌ను టీజీఐఐసీ నిర్మల జగ్గారెడ్డి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చర్మన్ ప్రభు, సీడీసీ చైర్మెన్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నర్సిములు, మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అశోక్, గోపాల్, బానోత్ నగేష్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపానికి గురైన ప్రతి వ్యక్తి భగవద్గీతను చదవాలి

- తాజా మాజీ వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-గుమ్మడిదల

మానసికంగా మనస్థాపానికి గురైన ప్రతి వ్యక్తి భగవద్గీతను చదువుకోవాలని తాజా మాజీ వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్ తెలిపారు. భగవద్గీత జయంతిని పురస్కరించుకొని గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో తాజా మాజీ వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్ అయ్యప్ప స్వామి మాల ధారణ ధరించిన ప్రతి ఒక్కరికి భగవద్గీత పుస్తకాన్ని బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండడానికి భగవద్గీతను చదువుకోవాలని తెలిపారు కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు తదితరులున్నారు.

దేవాలయ వార్షికోత్సవాలకు రూ.30 వేల విరాళం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో పోలేరమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి రూ.30 వేలను బుధవారం నిర్వాహకులకు విరాళం అందజేశారు కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాయకులు నక్క వెంకటేశం గౌడ్, క్యాతం బాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విశాల్ గౌడ్, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, మహిపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు గ్రామ ప్రజలు భక్తులు తదితరులున్నారు.

వ్యవసాయ సహకార సంఘం భవనానికి భూమి పూజ



నవతెలంగాణ-కొండాపూర్ : మండలంలోని ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యాల యానికి బుధవారం భూమి పూజ చేశారు. సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మెన్ ప్రభు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సదాకుల కుమార్, మానిక్ రెడ్డి, సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు సిద్దన్న, నర్సింహ రెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మోద్దిన్, ప్రభుదాస్, అలాగే సొసైటీ డైరెక్టర్లుచ, వార్డ్ మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు. సొసైటీ భవన నిర్మాణానికి రూ.36 లక్షలు కేటాయించినందుకు జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఛైర్మెన్ నిర్మలా జాగరెడ్డిలకు సొసైటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలో ని మాచేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు శివాజీ కూతురు వివాహ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి బుధవారం హాజరయారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్ కుటుంబాన్ని నిర్మలా జగ్గారెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చర్మన్ ప్రభు, సీడీసీ చైర్మెన్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహరెడ్డి, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నర్సిములు, మాజీ ఎంపిటిసి కిషన్ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అశోక్, గోపాల్, బానోత్ నగేష్ నాయక్,రమేష్ పాల్గొన్నారు.

మోహన్ బాబు క్షమాపణ చెప్పాలి

- తెలంగాణ ఉద్యమకారులు నరసింహారెడ్డి



నవతెలంగాణ-కొండాపూర్

జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మంచు మోహన్‌బాబు జర్నలిస్టులకు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు..తెలంగాణ ఉద్యమకారులు ఏ.నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. కుటుంబ గొడవల వల్ల గాయపడిన వ్యక్తికి సర్జరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఆ ఖర్చులన్ని మోహన్‌బాబు భరించాలని డిమాండ్ చేశారు. మంచు మనోజ్ గురించి మోహన్‌బాబు రిలీజ్ చేసిన వీడియోలో జర్నలిస్టులను, మీడియా సంస్థల యాజమాన్యాలను నోటికొచ్చినట్టు మాట్లాడిన మాటలను మోహన్ బాబు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల మీద దాడి చేయడం చాలా దురదృష్టకరం, మోహన్ బాబును వెంటనే అరెస్టు చేసి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు.

జీరో బిల్లు కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం లబ్దిదారులకు మండల అధికారుల నిర్లక్ష్యంతో ఆన్లైన్ తప్పిదంతో పూర్తిస్థాయిలో పథకం అమలు కావడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ జీరో బిల్లు గృహజ్యోతి పథకం కొరకు మండల ఎంపీడీవో కార్యాలయం, అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. విద్యుత్ జీరో బిల్లు ఎంతమందికి లబ్ధి చేకూరిందో తెలియ రాలేదు. ఈ విషయమై ఎంపీడీఓకు వివరణ కోరగా, ప్రజా పాలన దరఖాస్తులు, ఆన్లైన్ తప్పులు నమోదు, సరైన సమాచారం అధికారులకు ఇవ్వడం లేదన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

- రైతాంగానికి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు విరాళాలు ఇచ్చి జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు



నవతెలంగాణ-కొండాపూర్

భూసమస్యలు పరిష్కరించి రైతాంగానికి పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మనసాన్పల్లి గ్రామంలో ఇంటింటి విరాళాల సేకరణ కావించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ మండలంలో ధరణి సమస్యలతో ఏళ్ల గడుస్తున్నా పట్టా పాస్ పుస్తకాలు రాకపోవడంతో రైతు భరోసా, రైతు భీమా, బ్యాంకు రుణాలు రాకుండా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎం.నర్సిములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో ముని దేవునిపల్లి, మాందాపూర్, మన్సాన్ పల్లి గ్రామాలతో పాటు అనేక గ్రామాలలో వందలాది మంది రైతులు ధరణి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. పాత పాస్ పుస్తకాలు ఉన్న కొత్త పాస్ పుస్తకాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని రుణమాఫీ కాని రైతులకు వెంటనే రెండు లక్షల రుణాలు మాఫీ చేయాలని వ్యవసాయ కూలీలకు సంవత్సరంలో రూ.12 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఎద్దేవా చేశారు. ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించి ప్రతి రైతుకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.రాజయ్య, గ్రామ నాయకులు అంజన్న, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాలలో పొగాకు నియంత్రణ విభాగం అధికారులు పర్యటించారు. ప్రజలు, యువకులు పొగాకుతో తయారైన బీడీలు, సిగరెట్, గుట్కాలు ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం టోల్ ప్లాజా కూడలి వద్ద, జేఎస్టీయూ సుల్తాన్ పూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, బస్టాండ్ పరిసరాల దగ్గర, అదేవిధంగా చౌటకూర్ బస్టాండ్ వద్ద ప్రజలకు, యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ హైవే అథారిటీ సిబ్బందితో పొగాకు ఉత్పత్తులు వాడకూడదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను మనిషి వాడడం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ చుట్ట, సిగరెట్, జరదా, తంబాకు, పాన్ మసాలా లాంటివి ఉపయోగించరాదన్నారు. వీటి వల్ల మనుషుల్లో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని రూ.500 లు జరిమానా కూడా విధిస్తామన్నారు. విద్యాలయ ప్రాంతంలో ఉత్పత్తుల అమ్మకం నిషేధం, విద్యాలయాల చుట్టూ ఎవరైనా పొగాకు ఉత్పత్తి చేసినా, అమ్మినా జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింలు, మహిళా కానిస్టేబుల్ సరస్వతి, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు
- సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-గుమ్మడిదల

క్రీడలతోనే మానసిక ఉల్లాసం శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల స్థాయి సీఎం కప్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రీడోత్సవాలు అన్నారం పంచాయతీ పరిధిలోని హానారో పరిశ్రమ క్రీడా మైదానంలో ఎంపీడీవో ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు సీనియర్ క్రీడాకారులు హాజరై జెండావిష్కరణ కావించారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఉండాలన్నారు. మీమీ గ్రామాలకు మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, ఎస్సై మహేశ్వర్ రెడ్డి, అన్నారం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఏరువపోలీన, పంచాయతీ కార్యదర్శి సంగీత, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, మండలి తులసీదాస్, మేడిపల్లి మురళి, తుపాకుల రాజు, దర్గా శ్రీనివాస్, దర్గా బిక్షపతి, సంఘం శేఖర్ గౌడ్, డి లక్ష్మణ్, జిల్లా వాలిబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఏ కృష్ణ, మండల ఫిజికల్ డైరెక్టర్, పీఈటీలు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



నవతెలంగాణ-కల్హేర్

అనారోగ్యాలకు గురై ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన సంగారెడ్డి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ కోడలి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.24 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే తన స్వగ్రామమైన ఖానాపూర్ కే లోని తన నివాస గృహంలో అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యాలకు గురై ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు నారాయణ, మోహన్ సాగర్, పిరప్ప, గోపి, తదితరులు, పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ చెర్మన్ వై.నరోత్తం



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ఉత్తమ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన బోల్గర్ సంగప్ప ముదిరాజ్ మనవరాలు వివాహ వేడుకల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మన్ వై.నరోత్తం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో, మాజి ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మహమ్మద్ షాబుద్దీన్ తన బైకుపైన వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొని గాయాల పాలయ్యాడు. సుల్తాన్ పూర్ నుంచి నేషనల్ హైవే 161 మీదుగా చౌటకూర్ గ్రామంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డులో షాబోద్దిన్ వెళుతుండగా అదే సమయంలో చౌటకూర్ అండర్ పాస్ నుంచి చౌటకూర్ గ్రామం వైపు మంగలి బాబు తన ట్రాక్టర్ తీసుకొని ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ పైన ఉన్న షాబుద్దీన్ రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్ వాహనంలో స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం చేసిన తర్వాత మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. షాబుద్దీన్ సోదరుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు.

ఖలీల్‌పూర్ పాఠశాలలో ప్లేట్ల పంపిణీ



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఖలీల్ పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని సేవాదాత నర్సింగ్ రావు అన్నారు. ఖలీల్ పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు దాత నర్సింగరావు మధ్యాహ్న భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్జాపూర్ పాఠశాల హెచ్ఎం రాజ్ కుమార్, పాండయ్య, వెంకట్ రెడ్డి, గ్రామస్తులు సుధాకర్ రెడ్డి, పెంటన్న, విట్టల్ రెడ్డి, రామ్ రెడ్డి, మానయ్య, కృష్ణ, విద్యార్థులు ఉన్నారు.

ప్రజా సేవకులకు ఎక్కడైనా బ్రహ్మరథం

- జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి
- ఘనంగా సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రజా సేవకులకు ప్రజలు ఎక్కడైనా బ్రహ్మరథం పడతారని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సిద్ధం ఉజ్వల రెడ్డి అన్నారు. బుధవారం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యస్.గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఉజ్వల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు గిరిధర్ రెడ్డి చేసిన కృషి ఈ రోజు ఆయనను అంచలంచలుగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. గతంలో పార్టీ సంక్షేమానికి చేసిన కృషిని పార్టీ అధిష్టానం గుర్తించి ఆయనకు రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పవనాలు వీస్తే జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పవనాలు వీచే విధంగా అన్ని విధాల నియోజకవర్గంలో చక్రం తిప్పిన ప్రముఖ నాయకుడన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు రావాలని ఆకాంక్షించారు. జహీరాబాద్ పట్టణంలోని లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ ముందు యూత్ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌ను కట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి మండల పరిషత్ కార్యాలయం వద్ద గల (సెట్విన్ భవనం)కు నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య భారీ ర్యాలీగా వెళ్లి సెట్విన్ కార్యాలయం వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన సందర్భంగా ఆదరాభిమానాలతో తన పుట్టినరోజు వేడుకలకు హాజరైన ప్రతి ఒక్క నాయకునికి కార్యకర్తలకు అభిమానులకు సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా సెట్విన్ చైర్మన్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మహంకాళి సుభాష్ గుప్తా, కిషన్ పవర్, వైద్యనాథ్, శ్రీనివాస్ రెడ్డి, మురళీకృష్ణ గౌడ్, నియోజకవర్గ ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, రామలింగారెడ్డి, హనుమంతరావు పాటిల్, మహమ్మద్ మక్సుద్, శుక్లవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మహమ్మద్ ముబీన్, నరసింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, మాజీ యం.పి.పిలు,మాజీ సర్పంచ్‌లు రాములు యాదవ్, మహమ్మద్ ఖాజామీయా, మూతిరామ్ , జహంగీర్, యూనిస్ , రాములు నేత, గడ్డం జనార్ధన్‌లతోపాటు వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భుజస్కందాలపై నాయకున్ని మోసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

గీత రెడ్డి లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ వరకు చేరుకున్న వెంటనే యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజమాలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. రోడ్డుపై నుండి సభా వేదిక వరకు గిరిధర్ రెడ్డిని తమ భుజస్కందాలపై తీసుకొని వచ్చి వేదికపై దింపారు. రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యూత్ కాంగ్రెస్ నాయకులు రక్తదానాన్ని చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు ఉజ్వల్ రెడ్డి చేస్తున్న కృషి తమ అందరి మనసులను గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ హర్షవర్ధన్ రెడ్డి, న్యాల్కల్ జహీరాబాద్ మండల అధ్యక్షులు కిరణ్ గౌడ్ సునీల్, కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ సాయి, సీనియర్ నాయకులు రాజశేఖర్ , అత్తర్ గౌరీ. రాష్ట్ర యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్ల ప్రతాపరెడ్డి , మల్లికార్జున్ , జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ జిల్లా అధికారి గోవింద రామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి టీచింగ్ స్టాఫ్ అందరికీ ఆయన సలహాలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా స్టాఫ్ అంతా కృషిచేసి 100% ఫలితాల కోసం విద్యార్థులకు దిశా నిర్దేశం చేసి అత్యుత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలో ఉదయం 8:30 నుండి 9:30 వరకు స్టడీ అవర్స్ కండక్ట్ చేయడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఇష్టపడి చదవాలని మంచి ఫలితాల కోసం కృషి చేయాలని, మీ ఫలితాలు తల్లిదండ్రులకు ఆనందాన్ని ఇవ్వాలని, అదేవిధంగా కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. జిల్లాలోనే మంచి స్థానంలో నిలపడానికి కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం విద్యార్థులు విశేషంగా కృషి చేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు 90 డేస్ ప్రణాళిక అమలవుతుందని ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ముద్దం సిద్ధారెడ్డి, సుధాకర్, మారుతి, ఉదయ ప్రసాద్, కాటి అబ్బయ్య, జి రమేష్ సంజయ్, సిహెచ్ రవి, సలావత్ రవికుమార్, సాయిబాబా. వడ్ల రాచన్న లైబ్రేరియన్ మన్నె రమేష్. పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల తాజా మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బొంతపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో మాలాధారణ చేసిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. దాంతోపాటు సీఎం కప్ క్రీడోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నూతన విద్యాధికారికి పీఆర్టీయూ ఘన సన్మానం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నాగల్గిద్ద మండలానికి నూతన ఎంఈఓగా నియమితులైన మన్మధ కిషోర్‌కు మండల పిఆర్టియు శాఖ తరపున బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పిఆర్టియు శాఖ అధ్యక్షులు రమేష్, పిఆర్టియు మండల కార్యదర్శి నాగ్‌నాథ్, నాయకులు గణపతి, బాబుషెట్టి, విజేందర్ రెడ్డీ, సూర్యకాంత్, బస్వరాజు , బాస్ శెట్టి,లింగమేశ్వర్, శివరావు , సంగమేశ్వర్ , ఆనందకుమార్, మహేష్, శివశంకర్, లక్ష్మణ్ తదితర మండల నాయకులు పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు అందరూ అంకిత భావంతో సేవలు అందించా లని మండల విద్యాధికారి సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు నిలిపివేత

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గం లో శుక్రవారం, శనివారం పత్తి కొను గోలు కేంద్రాలు, పత్తి మిల్లుల కొనుగోలు నిలిపివేయనున్నట్లు మార్కెట్ కమిటి కార్యదర్శి వీరిశెట్టి తెలిపారు. పత్తి మిల్లులో ఎక్కువ స్టాక్ ఉండడం వల్ల పత్తి మిల్లులు పత్తి కొనుగోలు కేంద్రాలు నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతు సోదరులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడై వృద్ధులకు అన్నదానం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధి మానేపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి గత నాలుగు నెలల నుంచి అభాగ్యుల పాలిట ఆపద్బాంధవుడు అయ్యారు. వృద్ధులకు పెద్ద కొడుకై రోజు రెండు పూటలా భోజనం ఇంటి వద్దకే బాక్స్ ద్వారా ఇంటింటికి సుమారు 30 మంది వృద్ధులకు గత నాలుగు నెలల నుంచి అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నూతనంగా బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెద్దలు ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డిని శాలువలతో సన్మానించి ఆశీర్వదించారు. అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న విశాల హృదయం హనుమన్నగారి స్వరూప నరేందర్ రెడ్డి నిండు నూరేళ్ళు, చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. కొందరు తల్లిదండ్రులను వంతులు పెట్టుకొని అన్నం పెట్టే రోజుల్లో అభాగ్యులను అక్కున చేర్చుకొని భోజనం అందించడం గొప్ప మనసు అన్నారు. నేటి సమాజంలో ఇంతటి బృహత్తర కార్యాన్ని భుజస్కందాలపై వేసుకొని నడిపిస్తున్న నిరంతర అన్నదాత భగవంతుడు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి భగవంతుడు ఆశీర్వదించాలని కోరుతున్నామన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని బచ్చురాజ్ పల్లి గ్రామానికి చెందిన బోడ పట్ల శ్రీనివాస్ కూతురు వివాహానికి, మాజీ ఉపసర్పంచ్ మల్లేశం తమ్ముని కూతురు వివాహానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట పిఏసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, సుధాకర్ రెడ్డి, బిజ్జ సంపత్, చిమ్మనమైన నర్సింలు, డ్రైవర్ రాజు, ఆకుల మహేష్, రామావత్ నరేందర్, బజారు స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లెఫ్ట్ పార్టీలపై ప్రభుత్వాల కక్ష సాధింపు



నవతెలంగాణ-మెదక్ టౌన్

దేశంలో లెఫ్ట్ పార్టీలపై కేరళ, కేంద్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మల్లేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కేవల కిషన్ భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మల్లేశం మాట్లాడుతూ దేశంలో లెఫ్ట్ పార్టీలపై కేరళ, కేంద్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. దీనికి నిదర్శనం కేరళ రాష్ట్రంలోని లెఫ్ట్ ప్రభుత్వంపై నిరంకుశత్వంగా వ్యవహరిస్తూ వాయినాడ్ వరద బాధితులకు కేంద్ర విపత్తుగా పరిశీలించకుండా 400 మంది వరదల్లో ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోకుండా వదిలేసిందన్నారు. కేరళ ప్రభుత్వానికి రావలసిన కేంద్రం నిధులు కక్షపూరితంగా ఆపిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం లెఫ్ట్ పార్టీ లపై కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా రాబోవు రోజుల్లో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి బస్వరాజ్, సీఐటీయూ నాయకులు నాగరాజు, రాజశేఖర్, ఉషమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-మెదక్ టౌన్

మధ్యాహ్న భోజనం కార్మికులకు ఎండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజనం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు గౌరవ వే తనం రూ.3000లు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయన్నారు. విద్యార్థులకు స్కూళ్లలో వంట చేసి పెట్టే కూరగాయ బిల్లులు, గ్యాస్ బిల్లులు, గుడ్ల బిల్లులు ప్రభుత్వం చెల్లించకుండా ఎనిమిది నెలలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నుండి ఇప్పటి వరకు వచ్చిన మెను బిల్లులు, గౌరవ వేతనాలు గత ఆరు నెలలుగా ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్ లో పెట్టిందన్నారు. ప్రైమరీ స్కూలు స్థాయి విద్యార్థులు ఖర్చు సుమారు రూ.50,000 ల నుంచి లక్ష వరకు హై స్కూల్ విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో స్కూల్‌కి ఒక్కొక్క నెల లక్ష 50 వేల వరకు మెనూ చార్జీల కోసం ఖర్చు అవుతాయన్నారు. ప్రభుత్వ మాత్రం పెండింగ్ బిల్లులు చెల్లించకుండా మధ్యాహ్న భోజన కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పెండింగ్ బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పులు చేసి మధ్యాహ్న భోజనం పథకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ప్రమాద బీమా సౌకర్యంగాని, పిఏపీఎస్సీ సౌకర్యంగాని వేతనాల పెంచడం కాని రాష్ట్ర ప్రభుత్వం చేయడం లేదన్నారు. చాలీచాలని అతి తక్కువ వేతనాలతో జీవనాన్ని గడుపుతూ అప్పులు చేసే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన కార్మికులు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మధ్యాహ్న భోజనం కార్మికులందరూ సకాలంలో ఉదయం 10 గంటల వరకు జిల్లాలోని అన్ని మండలాల అన్ని గ్రామాల అన్ని పాఠశాలలు కార్మికులు తప్పకుండా హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికుల లక్ష్మి, బాలమణి, సుశీల, నరసమ్మ, సంగీత, ఆనంద తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- హాస్టల్లో తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ నగేష్



నవతెలంగాణ-మెదక్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం, వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ రూములు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలని మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయికి వెళ్ళాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మావతి సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, చార్ట్స్ పంపిణీ



- జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్

నవ తెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు సాజు తండా, పెద్దగూడెం తండా, వెనుక తండా, పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు జి.ఎం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్ స్టేషనరీ చార్ట్స్ అందజేశారు. బుధవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో హెచ్. టి. ఎం. ఎస్. మేనేజర్ ప్రవీణ్ కుమార్ జి.ఎం.ఆర్. వరలక్ష్మీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ చేతులమీదుగా నోట్ బుక్స్ స్టేషనరీ చార్ట్స్ పంపిణీ చేయడం జరిగింది. హెచ్. టి. ఎం. ఎస్. మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. వెనుకబడిన ఈ గిరిజన తండాలలో పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ చార్ట్స్, అందజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. విద్యార్థులు చిట్టి చేతులతో స్వయంగా తయారు చేసిన పువ్వుల బోకెలను జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు పరిసరాల పరిజ్ఞానం సృజనాత్మకత ఉండదని గిరిజన విద్యార్థులను చూస్తుంటే వారి కంటే ఈ విద్యార్థుల్లోనే అత్యధిక మేధాశక్తి ఉందన్నారు. ఒక్కొక్క విద్యార్థి ఒక్కొక్క ఏకలవ్యునిగా మాదిరిగా ఉన్నారని విద్యార్థులను అభినందించారు. గిరిజన తండాల్లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, సృజన, జ్యోతి, శ్రీకాంత్, లావణ్య, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్ష ఏ.ఎస్ .ఓ అరుణ్ కుమార్ జీఎంఆర్ హైవే సూపర్వైజర్ నిలేజ్ కుమార్ సిఎంఆర్ హాస్పిటల్ కోఆర్డినేటర్ రాజు నారాయణ వైద్యులు సాయిశ్రీ ప్రవీణ్ తాండవాసులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం



- సంఘ సేవకులు మోహన్ నాయక్

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన డబ్బు సుశీల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.5000లు, 25 కిలోల బియ్యం ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ బుధవారం అందజేశారు. నందిగామ గ్రామానికి చెందిన కట్టా లక్ష్మి గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న డాక్టర్ మోహన్ నాయక్ వారి కుటుంబానికి రూ.5000 ల ఆర్థిక సహాయాన్ని అందించారు. షౌకత్ పల్లి మూడవత్ దూది మరణించడంతో వారి కుటుంబానికి రూ.5000ల ఆర్థిక సాయం అందించారు. బచ్చు రాజు పల్లి, మల్లేశం తమ్ముని కూతురు వివాహానికి పుస్తె మట్టేలను అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చల్మెడ మహేష్, మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్రెడ్డి, నందిగామ శ్రీనివాస్, ప్రభాకర్, రమావత్ రాజు, పాల్గొన్నారు.

పేదింటి ఆడ బిడ్డకు పుస్తే మట్టెలు అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన పారిశుద్ధ కార్మికురాలు పల్లె నరసవ్వ పెద్ద బుచ్చయ్యల కూతురు రేణుక వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు తుమ్మల రమేష్ పుస్తె మట్టేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల వివాహాలకు పుస్తె మట్టేలను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామంలో ఇప్పటికీ ఎంతోమంది పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లకు పుస్తె మట్టేలు అందజేయడం జరిగిందని, నిరుపేద కుటుంబాలకు అనాథ కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామంలో ఎవరికైనా ఆర్థిక సహాయ, సహకారాలు అందించడానికి ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, కాకి రాజయ్య, యాదవ రెడ్డి, జంగి నరసింహులు, తుమ్మల ప్రవీణ్, బొమ్మన లక్ష్మణ్, బొమ్మెన మల్లేశం, పల్లె గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ- నిజాంపేట

మండలంలోని శౌకత్ పల్లి గ్రామానికి చెందిన ముడవత్ దూరి, కొంతం రాజయ్య కొన్ని రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాలను బుధవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంతారెడ్డి తిరుపతి రెడ్డి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున రూ.10వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. రైతుల రుణమాఫీ పూర్తిగా చేయలేదని, మహిళలకు 2500 పింఛన్ ఇస్తానని ఇప్పటికీ ఇవ్వలేదన్నారు, వృద్ధులకు 4వేలు పింఛన్ ఇస్తామని ఇవ్వలేదన్నారు. కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఇస్తామని మాట తప్పారన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనియెడల కాంగ్రెస్ పార్టీ పతనం కాక తప్పదు అన్నారు. ఇప్పుడు జెడ్పీటీసీ ఎంపీటీసీ సర్పంచులు సొసైటీ ఎన్నికలు నిర్వహించినట్లయితే పూర్తిగా బిఆర్ఎస్ అభ్యర్థులే గెలుస్తారని జోష్యం చెప్పారు. అనంతరం బచ్చు రాజు పల్లి గ్రామంలోని పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, కల్వకుంట పిఏసిఎస్ చైర్మన్ అందే కొండల్ రెడ్డి, నార్లాపూర్ మాజీ సర్పంచ్ గోపరి నరసింహులు, నందిగామ మాజీ సర్పంచ్ సంగు స్వామి, మావురం రాజు, రమావత్ నరేందర్. మడవత్ రాజు, పంపరి నగేష్, డ్రైవర్ రాజు, పత్తి నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు

రాజీ మార్గమే రాజ మార్గం



- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్

రాజీమార్గమే రాజ మార్గమని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీన జాతీయ అదాలత్ ఉంటుందని, కక్ష దారులు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్స్ కక్ష దారులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. లోకల్ అదాలత్ ద్వారా వెంటనే న్యాయం జరుగుతుందని చెప్పారు. కక్షలతో ఏం సాధించ లేమన్నారు. గొడవలు వద్దు రాజమార్గం ముద్దు అని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు

ట్రాన్స్‌కో ఏఈ పెంట నాయక్‌ను సస్పెండ్ చేయాలి



- టిఎస్‌యూఈఈయూ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్

పోల్ టూ పోల్ వర్కర్ (ఆర్టిజన్ 4) నర్సింలు నాయక్‌పై దాడి చేసిన వెల్దుర్తి ట్రాన్స్కో ఏ.ఈ పెంట నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని టీఎస్‌యు ఈఈయు యూనియన్ గౌరవ అధక్షులు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తూప్రాన్ డి.ఈ కార్యాలయం ముందు టిఎస్‌యుఈఈ యు (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 9న విధులకు హాజరైన పోల్ టూ పోల్ వర్కర్ (ఆర్టిజన్4) నర్సింహులు నాయక్ శెట్టి పల్లి లో యల్‌సి విషయంలో సరి చేయడానికి వెళు తుండగా స్థానిక ట్రాన్స్‌కో ఏ.ఈ పెంటనాయక్ వెంటనే నువ్వు రామయపల్లి సబ్ స్టేషన్‌కు రావాలని పిలువగా అక్కడికి వెంటనే వచ్చిన పోల్ టూ పోల్ వర్కర్(ఆర్టిజన్4) నర్సింలు నాయక్ అక్కడ వచ్చిన వెంటనే విధుల విషయంలో అడగాల్సిన ఏ.ఈ ఎటువంటి తప్పు చేయని పోల్ వర్కర్‌ని బూతుమాటలు తిడుతూ, బూటు కాళ్లతో కడుపులో తన్నుతూ , పక్కన ఉన్నరాడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ సంఘటనపై వెల్దుర్తి ట్రాన్స్ ఏఈ పెంట నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని తూప్రాన్ విద్యుత్ శాఖ డిఈకి టీఎస్ యు ఈ ఈ యు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినా నేటికి చర్యలు చేపట్టలేదన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆర్టిజన్స్ అందరినీ ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుఈఈయు సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు, యం నర్సింలు, గుడల రవీంద్ర ప్రసాద్, సురేష్, రమేష్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, ఫాసి, అశోక్ సలీం, సత్తిబాబు, సూరి, ప్రవీణ్, శ్రీను, హనుమంత్, పాల్గొన్నారు

మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

- టీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి డిమాండ్
- మెదక్ కలెక్టరేట్ ముందు నిరసన



నవతెలంగాణ-మెదక్

కవరేజ్‌కు వెళ్లిన వివిధ టీవీ ఛానళ్ల ప్రతినిధులపై దాడికి పాల్పడిన సీనియర్ సినీ నటుడు మంచు మోహన్ బాబుపై హత్యా యత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజెయూ) జిల్లా అధ్యక్షులు ఎ.శంకర్ దయాళ్ చారి డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ మోహన్ బాబు విలనిజం జర్నలిస్టులపై నడవదన్నారు. గతంలో సినిమా నటి సాక్షి శివానంద్, సీనియర్ నటి జయంతిలపై మోహన్ బాబు చేసిన దాడులు, పెట్టిన హింసలు ఇప్పటికి అనేక మందికి గుర్తు వున్నాయన్నారు. ఒక సినిమా నటుడుగా, నిర్మాతగా, డైరెక్టర్ గా, పార్ట్ టైం రాజకీయ వేత్తగా, విద్యా సంస్థల నిర్వాహకుడిగా, రియల్ ఎస్టేట్ ఓనర్‌గా..... ఎన్ని పాత్రలు వేసినా తన క్రిమినల్ బుద్ధిని మోహన్ బాబు ఏనాడు వదిలి పెట్ట లేదని ధ్వజమెత్తారు. నిజాలను భరించే శక్తిలేక టీ.వీ.9 ప్రతినిధిపై నటుడు మోహన్ బాబు వీరావేశంగా దాడి చేయడం అర్థరహితమన్నారు. మోహన్ బాబుపై హత్యా యత్నం కేసు నమోదు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, ఐజెయూ మాజీ సభ్యులు ఫరూక్ హుస్సేన్, నాయకులు మురళీధర్ గుప్తా, శ్రీధర్, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, అల్లాడి శేఖర్, శ్రీనివాస్, ఆంజనేయులు, కృష్ణమూర్తి, హమీద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



- క్రీడాకారుల ప్రతిభను బయటకు తీయడానికే సీఎం కప్
- మనోహరాబాద్ కార్యదర్శి రూపాగౌడ్

నవతెలంగాణ-మనోహరాబాద్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకుని క్రీడల్లో రాణించాలని మనోహరాబాద్ కార్యదర్శి రూపాగౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా చేపట్టిన సీఎం కప్ క్రీడోత్సవాలను మనోహరాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం స్థానిక జేఎంజే పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడల్లో ఖోఖో, వాలీబాల్ క్రీడలు జరిగాయి. సీఎం కప్ క్రీడల్లో మంగళవారం జరిగిన ఆటల్లో వాలీబాల్ ఆటలో మనోహరాబాద్, రంగాయిపల్లి టీంలు తలపడగా అందులో మనోహరాబాద్ క్రీడాకారులు విజయం సాధించారు. అలాగే కబడ్డీ ఆటలో మనోహరాబాద్, కాళ్ళకల్ టీంలు తలపడగా మనోహరాబాద్ గెలుపొందగా కాళ్ళకల్ రన్నర్‌గా నిలిచాయి. వారికి మనోహరాబాద్ కార్యదర్శి రూపాగౌడ్ అభినందనలు తెలిపారు. క్రీడాల్లో మంచి పట్టును సాధించి గ్రామానికి మండలానికి జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎదిగి మంచి పేరును తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని బయటకు తీసుకురావడానికి సీఎం కప: క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. బుధవారం వాలీబాల్, కోకో క్రీడలు నిర్వహించారు. క్రీడాకారులతో పాటు పీఈటీలు, పాల్గొన్నారు.

చేదెక్కిన చెరుకు ధర

- పెట్టుబడి అధికమాయే.. దిగుబడి తక్కువాయే
- కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్న రైతులు
- చెరుకు ధరలు పెంచాలని వేడుకుంటున్న రైతులు
- చెరుకు మద్దతు ధర రూ.5వేలు ప్రకటించాలి




నవతెలంగాణ-నిజాంపేట

ఒకప్పుడు అనగా దాదాపు 1980 సంవత్సరంలో నుండి మెదక్ జిల్లాలోని నిజాంపేట మండలంలో అత్యధికంగా రైతులు చెరుకు పంటలు పండించేవారు. నిజాంపేట మండల కేంద్రానికి తూర్పు పడమరన 2 ఖండసరి చెరుకు ఫ్యాక్టరీలు ఉండేటివి. ఒకటి నందిగామ శివారులో, ఇంకొకటి కల్వకుంట గేటు వద్ద, రెండు చక్కర ఫ్యాక్టరీలు ఉండడం వలన రైతులకు కూలీలకు కొదవ లేకుండే, అప్పుడు చెరుకు ధర గిట్టుబాటు ఉండేది ఎక్కడ చూసినా చెరుకు పంటలే కనిపించేవి. అప్పటి ప్రభుత్వాలు కరెంటు బిల్లులు పెంచడంతో చక్కెర ధర లేకపోవడంతో ఫ్యాక్టరీలను మూసేసే పరిస్థితి చివరకు ఫ్యాక్టరీలను కూల్చివేయడం జరిగింది. ప్రస్తుతం చెరుకు పంట పెట్టుబడికి అధిక ఖర్చు అవుతుందని దిగుబడి మాత్రం తక్కువ వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఎకరాకు ఎరువులకు, కూలీలకు, ట్రాన్స్పోర్టుకు, దున్నుకాలకు వెరసి 50 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు .సంవత్సరంలో ఒక పంట మాత్రమే చేతికి వస్తుంది. మెదక్ జిల్లాలో చక్కర ఫ్యాక్టరీలు లేక రైతులు వరి పంటలపై ఆధారపడాల్సి వస్తుందని, చెరకు ధర టన్నుకు రూ.3,750 లు మాత్రమే ఫ్యాక్టరీలు చెల్లిస్తున్నాయని రైతులు వాపోతున్నారు . ఎకరాకు 30 టన్నుల వరకే వస్తుందని రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరుకు మద్దతు ధర 5000 చేసినట్లయితే రైతులు లాభాలతో చెరుకు పంట సాగు చేసుకోవచ్చన్నారు. కామారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ 45 కిలోమీటర్ల నుంచి చెరుకును తరలించాల్సి వస్తుందని ట్రాన్స్పోర్టు చార్జీలు ఎక్కువ అవుతున్నందున రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. మెదక్ జిల్లాలో మంభోజిపల్లి షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభించినట్లయితే రైతులకు దగ్గరవుతుందని రవాణా ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరుకు ధర రూ.5000లు పెంచే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మండలంలో చెరుకు పంట సాగు చేయడం తగ్గిందని పెట్టుబడి అధికమవుతున్నందున దిగుబడి తక్కువ చెరుకు మద్దతు ధర లేక రైతులు వరి పంటపై మొగ్గుచూపుతున్నారు. చెరుకు పెట్టుబడి ఎకరాకు దాదాపు రూ.50 వేల వరకు ఖర్చవుతుందని, చెరుకు ఒక ఎకరాకు దిగుబడి 30 టన్నుల వరకే వస్తుందని, ఒక టన్నుకు రూ.3750 లు మాత్రమే రేటు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం రూ.5000ల చొప్పున చెల్లించేలా ప్రభుత్వము తగు చర్యలు తీసుకోవాలి


చెరుకు మద్దతు ధర రూ.5వేలు ప్రకటించాలి



మండలంలో చెరుకు పంట సాగు చేయడం తగ్గిందని పెట్టుబడి అధికమవుతున్నందున దిగుబడి తక్కువ చెరుకు మద్దతు ధర లేక రైతులు వరి పంటపై మొగ్గుచూపుతున్నారు. చెరుకు పెట్టుబడి ఎకరాకు దాదాపు రూ.50 వేల వరకు ఖర్చవుతుందని, చెరుకు ఒక ఎకరాకు దిగుబడి 30 టన్నుల వరకే వస్తుందని, ఒక టన్నుకు రూ.3750 లు మాత్రమే రేటు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం రూ.5000ల చొప్పున చెల్లించేలా ప్రభుత్వము తగు చర్యలు తీసుకోవాలి.

వొజ్జా తిరుపతి, నిజాంపేట రైతు

చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభించెల చర్యలు చేపట్టాలి



మెదక్ జిల్లాలోని మంభోజిపల్లి చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభించేలా ప్రభుత్వము తగు చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా మెదక్ జిల్లాలో ఒక్కటి కూడా చక్కెర ఫ్యాక్టరీ లేదని రైతులు వరి పంటల మీదనే ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని ప్రత్యామ్నాయ పంటలు వేయాలంటే చక్కెర ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించేలా ప్రభుత్వము తగు చర్యలు చేపట్టాలి.

కంపే తిరుపతి, నిజాంపేట రైతు

భోజన నాణ్యతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-చైర్ పర్సన్ వనిత

నవతెలంగాణ-దుబ్బాక



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పరిశుభ్ర వాతావరణంలో వండిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని, వంట గదులు, కూరగాయలు, నూనెలు, వంట సరుకులను ఎమ్మార్వో సంజీవ్ కుమార్, ఎంపీడీవో భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. ఆహారం సరిగా లేదని, పాఠశాలలో సగం మంది విద్యార్థులు వారివారి ఇళ్లనుండే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మధ్యాహ్న భోజన కాంట్రాక్టర్, నిర్వాహకులపైమండిపడ్డారు. మరోసారి టిఫిన్ బాక్సులు కనిపిస్తే ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునేలా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఆమె వెంట ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగరాజు, కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ పలువురున్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మద్దూరు



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య కోరారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆన్లైన్ గేమ్, గుట్కా, గుడుంబా, గంజాయి, ఉచ్చులో పడవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

నవతెలంగాణ-కొండపాక

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కుకునూరుపల్లి మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు కుకునూరుపల్లి మండలంలోని లకుడారం ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థుల స్థాయిని పరీక్షించారు. ఈ నెలలో ఎఫ్ఎల్ఎన్ మధ్యంతర పరీక్ష, ఎఫ్ఏ-3 పరీక్షలు ఉన్నాయని వాటికి విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించి శుచి శుభ్రతతో నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల సర్వే



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామపం చాయతీలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, మాజీ సర్పంచ్ దేవులపల్లి యాదగిరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

డాక్టర్ రాజేశ్వర్ రెడ్డికి అరుదైన బిరుదు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ రాజేశ్వర్ రెడ్డికి అరుదైన బిరుదు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుపతి పట్టణంలోనీ మహతి ఆడిటోరియంలో జ్యోతిష్య రంగంలో ఆయన చేసిన సేవలకు ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ వారు కేపీ, నాడీ సెమినార్‌లో భాగంగా డాక్టర్ రాజేశ్వర్ రెడ్డికి 'జ్యోతిష్య పరిహార భాస్కర' బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలో ప్రముఖులు ఆయనను అభినందించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని గట్లమ ల్యాల మాజీ ఎంపీటీసీ చెలిమిళ్ల ఓజలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చెలిమిళ్ల ఓజలు మాట్లాడుతూ రైతులకు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణ మాఫీ చేస్తానని చెయ్యట్లేదు, రైతు బంధు రానేలేదు .6 గ్యారంటీలు అని చెప్పి రైతులను మోసం చేశాడని, ప్రజా పాలన అని చెప్పి పోలీస్ పయారలో పాలన కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ రాష్టానికి శ్రీరామ రక్ష అని బావించి లావుడ్య వీర్య నాయక్ అద్వర్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం జరిగిందని పేర్కొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

మండల స్థాయి రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులకు నేడు నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనునట్లు ఎంపీడీఓ బి.లక్ష్మప్ప తెలిపారు. ఈ నెల 6న నంగునూరు మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో వార్డుల వారిగా పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామని తెలిపారు. ఈ విషయంలో నేడు ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం ఉంటుందని చెప్పారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

కస్తూర్బా పాఠశాల సమస్యను పరిష్కారిస్తాం



నవతెలంగాణ-మర్కుక్

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమస్య పరిష్కా రానికి తమ వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సా రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎంఈవో వెంకట రాములుతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను ఎస్ఓ భాగ్యలక్ష్మీ ఆయనకు వివరించారు. వర్షం పడితే పాఠశాల ఆవరణలో నిళ్ళు నిలిచి విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని, డ్రయినేజీ సమస్య ఉందని తెలిపారు. పాఠశాల ఆవరణలో మట్టిని పోయిస్తామని, డ్రెయినేజీ సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ నిచ్చారు.

మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి క్రీడలను బుధవారం ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కరచాలనం చేస్తూ పరిచయం చేసుకున్నారు. ఎంపీడీఓ ప్రవీన్, ఎంఈఓ, ఎస్ఐ క్రిష్ణారెడ్డి, పీడీ కనుకారెడ్డి, నాయకులు దామోదర్, లింగాల శ్రీనివాస్, రొడ్డ మల్లేశం, అయా పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.

వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

నవతెలంగాణ-సిద్ధిపేట



అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా, పకడ్బందీగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఇందిరమ్మ కమిటీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల కొరకు అర్హులైన లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు మొబైల్ యాప్ నమోదు చేసే తీరును పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా వివరాల నమోదు జరగాలని, ఇంటి స్థలం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ లు పరిశీలించుకుని అవి సరైనవని ధృవీకరించుకున్న తరువాతే యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఇదివరకు ప్రభుత్వంచే లబ్ధిచేకురిన వారు అనర్హులుగా, తప్పనిసరిగా ఇంటి స్థలం వద్దనే జియో టాగింగ్ చెస్తేనే యాప్ వారి వివరాలను తీసుకుంటుందని సూచించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఈ సర్వేలో అర్హులైన ప్రతి ఒక్కరు నమోదు చేసుకునే విధంగా ప్రజలను చైతన్య పరచాలని ప్రజాప్రతినిధులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సలీం, సూపర్వైజర్లు, సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను కలెక్టర్ మనో చౌదరి బుధవారం పరిశీలించారు. ఇండ్ల సర్వే పై అధికారులకు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అత్యంత జాగ్రత్తగా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు. ఇదివరకే ప్రభుత్వంచే లబ్ధి చేకూరిన వారు అనర్హులుగా ఉంటారని తప్పనిసరిగా ఇంటి స్థలం వద్దనే జియో టాకింగ్ చేస్తేనే యాప్ వివరాలు తీసుకుంటుందని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, దుర్గయ్య, వెంకటరెడ్డి, కవిత, యాదమ్మ, భూమయ్య, నర్సింలు, విష్ణు శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మద్దూరు, దూల్మిట్ట పేర్లు నిలబెట్టాలి

-టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



సీఎం కప్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో మద్దూరు దూల్మిట్ట మండలాల క్రీడాకారులు పేరు నిలబెట్టాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం కప్పు క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తన సొంత ఖర్చులతో క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు షీల్డ్ ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సీఎం కప్ క్రీడలను ప్రారంభించినట్లు తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. జిల్లా రాష్ట్రస్థాయిలో పాల్గొని మండలాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్వేత వెంకన్న, ఎంఈఓ వరదరాజు ఎంపీఓ వీర రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, కార్యదర్శి శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బియ్య మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శిలు గద్ద వెంకటేశ్వర్లు, మాధవ్ జాదవ్, పీఈటీ ఇంతియాజ్, పీడీ ప్రేమ్ కుమార్, నాయకులు కనక చంద్రం, గుండెగోని మల్లేశం, పుల్లూరి రాజు, పాల్గొన్నారు.

19న ఛలో సిద్దిపేట

నవతెలంగాణ-గజ్వేల్



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా మాదిగ జాతిని మోసం చేస్తున్న సీఎం తీరును నిరసిస్తూ మాదిగ విద్యార్థులను సమాయత్తం చేయడంలో భాగంగా ఈ నెల 19న సిద్దిపేట కేంద్రంలో ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభ" నిర్వహిస్తున్నామని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ తెలిపారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఆ సభకు ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని, మాదిగ ఉప కులాల విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఉబ్బని ఆంజనేయులు మాదిగ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కాలేజీ మాదిగ విద్యార్థుల సమావేశంలో నూతన కమిటీని నియమించారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా గౌతం మాదిగ, ఇన్చర్గా సంజయ్ మాదిగ, ప్రధాన కార్యదర్శులు మనోజ్ మాదిగ, అధికార ప్రతినిధులు అజయ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా అభినవ్, రాకేష్, కార్యదర్శి అజయ్, నవీన్, సహాయ కార్యదర్శిగా వివేక్, భాను ప్రసాద్, అరుణ్, కార్యవర్గ సభ్యులు, తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ మాదిగ, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు మైస రాములు మాదిగలు పాల్గొన్నారు.

సమాచారం ఇస్తే వివరాలను గోప్యంగా ఉంచుతాం..

- హుస్నాబాద్ సీఐ కోంఢ్ర శ్రీనివాస్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



గ్రామాల్లో, పట్టణాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మిన వినియోగించిన సమాచారం ఇస్తే మీ వివరాలను గోప్యంగా ఉంచుతామని హుస్నాబాద్ సీఐ కోంఢ్ర శ్రీనివాస్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హై స్కూల్ విద్యార్థినిలకు మహిళల, బాలికల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ నూతన చట్టాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకే సోషల్ మీడియాను వాడుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి చదువు చాలా ముఖ్యం, కుటుంబ సమస్యలను చదువుతూ ముడి పెట్టవద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆపదలో డయల్ 100, లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తోట మహేష్ , స్కూల్ ప్రిన్సిపల్ జయమాల, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి, కానిస్టేబుల్లు కృష్ణ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడులో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి మరుపాక నరేష్
- తొగుట మండల వ్యవసాయ అధికారి మోహన్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పొద్దుతిరుగుడులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మరుపాక నరేష్ అన్నారు.బుధవారం సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరు చిన్న గుండవెల్లి రాఘవాపూర్ గ్రామంలో పొద్దుతిరుగుడు పంట పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పొద్దుతిరుగుడు శాఖీయదశ, పూతదశలో ఉన్నది గత కొన్ని రోజులుగా చలి వాతావరణం పెరగడం వలన పొద్దుతిరుగుడులో పచ్చ పురుగు సోకి పంటను నష్టపరిచి దిగుబడి రాకుండా చేస్తుందని అన్నారు. దీనికి రైతులు వేప నూనె లీటర్ ఇమమేక్టిన్ బెంజోయేట్ నోవాల్యూరాన్ 320 మి. లీ ఒక ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి మొక్క బొడ్డె తడిచే విదంగా పిచికారి చేసుకోవాలని సూచించారు .



నవతెలంగాణ-తొగుట

పొద్దు తిరుగుడు పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మోహన్ తెలిపారు. బుధవారం కాన్గల్ గ్రామంలో కొండల్ రెడ్డి రైతు పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా చలి పెరుగుతున్నందున్న పొద్దుతిరుగుడులో పచ్చ పురుగు ఉధృతి పెరిగింది. తొలి దశలో పచ్చ పురుగు గమనించినచో రైతులు వేప నూనె పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని గమ నించినచో ఇమమేక్టిన్ బెంజోయేట్, నోవాల్యూ రాన్ 320 మి. లీ (బెరాజిడ్) ఒక ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి మొక్క, బొడ్డె తడిచే విధంగా పిచికారీ చెయ్యాలని అన్నారు. ఈ క్షేత్ర సందర్శన లో, రైతులు కొండల్ రెడ్డి, నర్సయ్య, మహేష్, తదితరులున్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో రెవిన్యూ డివిజన్ అంశంపై మాట్లాడాలి

- ఎమ్మెల్యే పల్లాకు తెలుగుదేశం నాయకుల వినతి

నవతెలంగాణ-చేర్యాల



అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవిన్యూ డివిజన్ అంశంపై మాట్లాడాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గు రాజు మాట్లాడుతూ రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం విప్పి చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, బాధలు, అవసరాలను గుర్తించి రెవిన్యూ డివిజన్ సాధించడంలో తమ వంతు కృషి తప్పకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఒగ్గు రాజు తోపాటు పాము శివలింగం, కర్ర చంద్రారెడ్డి, ఎగ్బాల్ ఉన్నారు.

పేదల కోసం మళ్లీ కేసీఆర్ రావాలి

- మాజీ కౌన్సిలర్ స్రవంతి శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్



పేదల కోసం మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ రావాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కళ్యాణ్కర్ స్రవంతి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా ఎక్కడ వెళ్లిన కేసీఆర్ ప్రజలు గుర్తు చేసుకుంటు న్నారన్నారు. మున్సిపల్ పరిధిలోని పెండింగ్ పనులు ఇప్పటివరకు పూర్తి చేయలేకపోయారన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేసే సత్తా కాంగ్రెస్ వద్ద లేదని కేసీఆర్ వస్తేనే మళ్లీ సంక్షేమ పథకాలు అమలు జరుగుతుందని చెప్పారు. కళ్యాణ్ లక్ష్మి, షాద్ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్టు, రైతు భరోసా, ప్రతి నెల మొదటి తారీకు వృద్ధులకు పింఛన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు ఉందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో మున్సిపల్ పరిధిలోని ఏ ఒక్క పథకాన్ని ప్రభుత్వ అమలు చేయలేక పోయిందన్నారు. మున్సిపల్ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ ప్రభుత్వం తిరిగి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, మురికి కాలువ పనులు, అండర్ డ్రైనేజీ పనులు పూర్తి నిలిచిపోయి పూర్తి కాలేవన్నారు. రింగ్ రోడ్డు పనులు, ఇంద్ర పార్కు కోట మైసమ్మ రోడ్డు పూర్తి దశలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేక పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తిచేస్తే బాగుంటుందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినదని గుర్తు చేశారు.

నిరుద్యోగులకు గ్రంథాలయం వరం లాంటిది

- గ్రంథాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
- సందర్శించిన జిల్లా గ్రంథాలయ చైర్మెన్ లింగమూర్తి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



విద్యార్థులకు, నిరుద్యోగులకు గ్రంథాలయం ఒక వరం లాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగ చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం చైర్మెన్ లింగమూర్తి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గుర్రాల గొంది గ్రంథాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికై కృషిచేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు, ప్రజలకు అందుబాటులో తెస్తామన్నారు. ఈ గ్రంథాలయంలో రూ. 30 లక్షలతో అధునాతన వసతులు, పుస్తకాలను, మాస పత్రికలను, దినపత్రికలను అలాగే మౌలిక వసతులను మంజూరు చేస్తామని అన్నారు. గ్రామాల్లో యువకులు చైతన్యవంతులను చేసేందుకు అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రంథాలయాలు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్, డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా మార్గాన్ని మార్చండి

-సెస్ అధికారులకు పెరుకబండ వాసుల విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి

తమ ఇళ్లపై నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సరఫరా మార్గాన్ని మర్చాలని సెస్ విద్యుత్ అధికారులకు మండల పరిధిలోని పెరుకబండ వాసులు విజ్ఞప్తి చేసినట్టు బుధవారం తెలిపారు. గతంలో ఇళ్లపై నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ మార్గం వల్ల ఆకస్మిక ప్రమాదం సంబంవించి వ్యక్తి మృతి చెందాడని, అధికారులు విద్యుత్ మార్గాన్ని మార్చాలనీ స్థానికులు కోరారు.

సినీ నటుడు మోహన్ బాబును అరెస్టు చేయాలి





నవతెలంగాణ-దుబ్బాక

వార్తల సేకరణ కోసం సినీ నటుడు మోహన్ బాబు ఇంటికి వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేయడాన్ని దుబ్బాక ప్రెస్ క్లబ్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మోహన్ బాబును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అధ్యక్షులు సీహెచ్.రాజమల్లు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ దుబ్బాక పట్టణ కేంద్రంలో బుధవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మోహన్ బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టుల పట్ల మోహన్ బాబు అహంకారపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. జర్నలిసులపై దాడి చేస్తే సహించబోమని హెచ్చరించారు. జర్నలిస్టులు షౌకత్, యాదగిరి, బాలరాజు, పర్శరాములు, శ్రీనివాస్, స్వామి, కళ్యాణ్, లక్ష్మణ్, సుధాకర్ పలువురున్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

జర్నలిస్టుపై దాడిని ఖండిస్తున్నామని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సినీ నటుడు మోహన్ బాబు ఇంటిదగ్గర గత మూడు రోజులుగా జరుగుతున్న గొడవల నేపథ్యంలో కవరేజ్‌కు వెళ్లిన టీవీ9 రిపోర్టర్ రంజిత్‌పై దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. దాడి చేసిన అయనపై కేసు నమోదు చేసి, శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా మన్నారు.

నవతెలంగాణ-సిద్ధిపేట

మీడియా జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడం సరికాదని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రంగాచారి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మోహన్ బాబు మీడియాపై దాడికి నిరసన వ్యక్తం చేసి, ప్రెస్ క్లబ్ నుంచి విక్టరీ టాకీస్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన వారిపై దాడి చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. దాడులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం, పోలీసులు మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోహన్ బాబు, అనుచరులపై పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు గరి పెల్లి శ్రీనివాస్, రంగదాంపల్లి శ్రీనివాస్, సంజీవరెడ్డి, మజ్జు, రఘు, అరుణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

జర్నలిస్టులపై దాడి చేసిన నటుడు మోహన్ బాబు, తన అనుచరులపై చర్యలు తీసుకోవాలని మిరుదొడ్డి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎలుముల రాజు, మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడుతూ టీవీ9 కెమెరామెన్‌పై నటుడు మెహన్ బాబు దాడి చేయటం సరికాదు. పద్మ భూషన్ అవార్డును సైతం వెంటనే రద్దు చేయాలన్నారు. లేనిచో టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

నవతెలంగాణ-తొగుట

జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు, తన అనుచరులపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉశ్లేంగాల సాయి కుమార్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కవరేజ్‌కి వెళ్ళిన టీవీ9 జర్నలిస్ట్ కెమెరామెన్‌పై దాడి చేయడం సరికాదు అన్నారు. పద్మ భూషన్ అవార్డు సైతం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో టీయూడబ్ల్యూజేఐజేయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

వాహన దారులకు పోలీసుల కౌన్సిలింగ్

నవతెలంగాణ-మద్దూరు



ధూల్మిట్ట మండల కేంద్రంలోని వాహన దారులకు మద్దురు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొబేషనరీ ఎస్సై సౌజన్య ఏఎస్ఐ విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ 18 ఏండ్లు నిండని యువకులు వాహనాలు నడపవద్దని, నడిపితె దానికి బాధ్యులైన తల్లి తండ్రిలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం సేవించి వాహనలు నడపరాదని, నడిపితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. వాహనాలు నడిపే వాహనదారులు అందరూ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-తొగుట



మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బెజ్జన బోయిన అనిల్ అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాద వశాత్తు విద్యుద్ఘాతంతో మృత్యువాత చెందింది. చేప్యాల శివారు పొలంలో మేత మేస్తుండగా ఎద్దుకు కరెంట్ షాక్ తగలడంతో అక్కడిక్కడే మృత్యువాత చెందింది. ఎద్దు విలువ రూ. 75వేల వరకు వుంటుంది. ఆ రైతు కుటుంబానికి నష్టం కలిగింది.

తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

-సీఐలు బి. సైదా, ముత్యం రాజు

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలను గమనించాలని స్థానిక సీఐలు బి. సైదా, ముత్యం రాజులు అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని పాన్ డబ్బాలు, టీ పాయింట్లల్లో పట్టణ శివారు ప్రాంతంలో జాగిలాలతో తనిఖీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాలతో గంజాయి మత్తు పదార్థాలపై తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, మత్తుపదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్ అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి రహిత జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా సమాచారం ఇవ్వాలన్నారు. అక్రమంగా రవాణా చేసిన పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే డయల్ 100, గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

15న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా మహాసభలు

-డీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహరాజ్

నవతెలంగాణ-సిద్ధిపేట



జిల్లా కేంద్రంలో ఈనెల15న జరిగే ధర్మ సమాజ్ పార్టీ జిల్లా మహాసభ (ప్లీనరీ)కి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధినేత విశారదన్ మహారాజ్ హాజరవుతారని జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ధర్మసమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లాలో ప్రారంభించబడి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా 15న జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ పార్టీ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభ కి జిల్లావ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీబీ. రాజు, జిల్లా నాయకులు వేముల ప్రసన్న, చెంచల ఎల్లన్న, కట్ల అంజిబాబులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

సిద్దిపేట జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ అధికారిగా అవార్డు అందుకున్న రేబర్తి పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆయన వచ్చినప్పటి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని తెలిపారు. అతనికి అవార్డు రావడం అభినందనీయమని గ్రామం పేరు జిల్లా స్థాయిలో తీసుకువెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నవీన్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేటకు చెందిన డా. మాంకాల నవీన్ కుమార్‌ను సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో స్థానిక వీఎస్ఎస్ కన్వెన్షన్‌లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా తాజామాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు యాసాల వెంకట్ లింగం, మంచాల శ్రీనివాస్, జిల్లా తాజామాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి, సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ కన్వీనర్, పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సందిటి లక్ష్మి, దూలం విజయ, గద్దల మహేందర్, శవాల్ల రాజయ్య, ఇరుమల ఐలయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు గునుకుల రామ్ రెడ్డి, ఆశవర్కర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో అంగన్వాడీ సెంటరు రెండులో ఐదు నెలలు నిండిన గర్భిణీలకు సీమంతాలు చేశారు. సీమంతం పొందినవారు వారి పేర్లు బిల్లాల మానస, బిల్లా లో భానుప్రియ, కామెర్ల మనుష, కేతుముల్లో ప్రియాంక లకు ఉన్నారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రసాదం చేశారు. ఇందులో గుడిసే అద్విత్య స్వామిత్యకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ బూరుపల్లి రాజిరెడ్డి, విలేజ్ సెక్రటరీ అన్నపూర్ణ, హెల్త్ సూపర్వైజర్ శోభారాణి, ఏఎన్ఎం అనిత, తదితరులున్నారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ములుగు

పేదింటి యువత వివాహ నికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి బాసటగా నిలిచారు. మండల కేంద్రమైన ములుగులోని కీర్తిశేషులు చాకలి శంకర్ కూతురుకి వివాహ వేడుకకు హాజరైన ఆయన శంకర్ కుటుంబానికి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బుధవారం పెళ్ళికూతురు అన్నయ్యకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించి బాసటగా నిలిచారు. ఆయనతో పాటు కృష్ణ, యూసుబ్, సురేష్, మహేష్, మల్లేష్ తదితరులున్నారు.

అక్బర్‌పేట-భూంపల్లి విద్యార్థికి ద్వితీయ బహుమతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికి చేయడానికి క్రీడలు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ నరోత్తం రెడ్డి అన్నారు. జిల్లా మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ బహుమతి పొందిన అక్బర్‌పేట-భూంపల్లి విద్యార్థిని. కొండపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన టెస్టులో మమత అనే విద్యార్థి ద్వితీయ బహుమతి పొందారు. అనంతరం పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు దయాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభి నందించారు. ఉపాధ్యాయులు భాగ్యవతి, స్వామి, భాగ్య, సంతోషి పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

- చైర్ పర్సన్ వనిత

నవతెలంగాణ-దుబ్బాక

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసికంగాను బలపడవచ్చని, అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేటలో మోడల్ స్కూల్లో నిర్వహిస్తున్న "సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీ"లను ఎమ్మార్వో ఈ.సంజీవ్ కుమార్, ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ కే రమేష్ కుమార్, ఎంఈఓ జోగు ప్రభుదాస్, 10, 11 వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్ లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కబడ్డీ, కోకో, వాలీబాల్



పోటీల్లో 18 టీంలు పాల్గొంటున్నాయని ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని ఎంఈఓ ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజు, క్రీడల కన్వీనర్ శైలజ, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపీఓ నరేందర్ రెడ్డి,పలువురు పాల్గొన్నారు.

యువత తలుచుకుంటే ఏదైనా సాధిస్తారు

- యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు
- యాంటి డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజేషన్ తోట కమలాకర్ రెడ్డి

నవతెలంగాణ-మిరుదొడ్డి

యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చునని యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములై దేశ ఖ్యాతిని కాపాడాలన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో ఈనెల 13వ తేదీన నిర్వహించే రన్ ఫర్ ఆంటీ డ్రగ్స్ టీ షర్ట్‌ను గ్రామ యువకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో యువత, గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసిడ్రగ్స్ తరిమికొట్టాలని గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ గ్రామీణ ప్రాంతంలో విస్తరిస్తున్న నేపథ్యంలో అరికట్టేందుకు రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమాన్ని చేపట్టి యువకులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుం దన్నారు. గ్రామంలో నిర్వహించే 2కె రన్ విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. యువతతో పాటు ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడితేనే దేశ భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ డ్రగ్స్ సభ్యులు మల్లేశం, లింగం, మాజీ సర్పంచ్ బాల నరసింహులు, పలువురు పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే బీఆర్ఆర్ లక్ష్యం

- బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే బీఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాంసాగర్ గ్రామానికి చెందిన రాళ్లబండి లక్ష్మి -రమేష్ చారి కూతురు అఖిల వివాహానికి బీఆర్ఆర్ ఫౌండషన్ ద్వారా ఆయన పుస్తె మెట్టెలు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో కుటుంబానికి సహకారంగా నిలవాలని పుస్తె



మెట్టెలు అందజేశామన్నారు. పేద కుటుంబాలకు సహాయం చేయడం వల్ల ఆనందం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కేనపల్లి నరేందర్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం



నవతెలంగాణ-సిద్దిపేట

అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింప చేసేలా చొరవ తీసుకుంటామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. సిద్దిపేటలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ళ కోసం ఆయన ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే అంతట జరుగుతుందని, అర్హులైన వారు ఎవరు కూడా ఆందోళన చెందవద్దన్నారు. బీఆర్ఎస్ నాయకులు పుకార్లు నమ్మవద్దని అన్నారు. ఎవరైనా వచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయజుద్దీన్, 29 వార్డ్ ఇంచార్జ్ రాషాద్, నాజ్జు బబులు, ఫాయాజ్, పాల్గొన్నారు.



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరబోతుందని కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఇళ్ల సర్వే చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తదన్నారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గడీల పద్మా రెడ్డి, పూజ, రాజు, పుల్లగూర జనార్దన్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

శ్రీశైలంలోని వడ్డెర సత్రం డైరెక్టర్‌గా రేపాక స్వామి

నవతెలంగాణ-కొండపాక

శ్రీశైలం దేవాలయ వడ్డెర, వడ్డె రాజుల సామాజిక సత్రం డైరెక్టర్‌గా కొండపాక గ్రామానికి చెందిన రేపాక స్వామి నియామకమయ్యారు. సత్రం చైర్మెన్ జరిపట్టి రాములు నియామక పత్రం అందజేశారు. నియామకమైన సందర్భంగా బుధవారం కొండపాకలో డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి స్వామికి శాలువా కప్పి సన్మానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా కమిటీ ఆదేశాల మేరకు సేవలందించాలని దేవేందర్ రెడ్డి సూచించారు. పదవి రావడం పట్ల వడ్డెర కులస్తులు



గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

భగవద్గీత పుస్తకాలను భక్తులకు ఉచితంగా పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్

గీత జయంతిని పురస్కరించుకుని గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించి బుధవారం రామకోటి కార్యాలయంలో భగవద్గీత పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ భగవద్గీత అనగా భగవంతునిచే గానం చేసినట్లు చెప్పారు.లోకంలో ఉన్న సర్వ విషయాలు గీతలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రామకోటి ప్రతినిధులు పాల్గొన్నారు.

నాయిని సందీప్ కుమార్ ఆధ్వర్యంలో

ప్రజలు ఉదయమే లేచి చదివే భగవద్గీత పుస్తకాన్ని బీజేపీ పట్టణం ఉపాధ్యక్షులు నాయిని సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఈ



కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత ప్రతి ఇంటిలో ఉందని అయినా ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు ఉచితంగా వార్డు ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు రాములు, పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, నాయకులు వెంకట్ రెడ్డి, నరసింహ, రోహిత్ పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్‌లో మార్కెటింగ్ మేళా

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

విద్యార్థులు విద్యతో పాటు రైతాంగంపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో మార్కెటింగ్ మేళ నిర్వహించామని పాఠశాల డైరెక్టర్ థామస్ రెడ్డి, కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు రైతు బజార్‌పై భారీ మార్కెట్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రైతు బజార్‌లో అమ్మడానికి పండ్లు, కూరగాయలు, స్వీట్స్, గాజులు, చెప్పులు, బేకరీలో లభించే ఆహార పదార్థాలు వివిధ వస్తువులతో భారీ మార్కెట్ మేళాను ఏర్పాటు చేశారన్నారు. ఈ బజారులో విద్యార్థులు ఉపాధ్యాయులు తమకు అవసరమైన కూరగాయలను సరుకులను, డబ్బులు చెల్లించి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కాటారాయప్ప మాట్లాడుతూ తినే ఆహార పదార్థాలను, రైతులు ఏ విధంగా పండించి మార్కెట్లో అమ్మడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యక్ష రూపంగా వివరించమన్నారు. రైతులు పడుతున్న కష్టాన్ని పండిస్తున్న పంటలను అమ్మకంలో ఎదురవుతున్న ఇబ్బందులను విద్యార్థులకు వివరించమన్నారు. పండించే వారెవరు అమ్మే వారెవరు అనే విషయాల పై విద్యార్థులకు అవగాహన కల్పించమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.





ఆయిల్ పామ్ పంటల సాగు రైతులకు మేలు

- గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్

నవతెలంగాణ-రాయపోల్

రైతులు ఆయిల్ పామ్ పంటలతో అధిక దిగబడులు పొందవచ్చని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ఆయిల్ పామ్ పంట పై, వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వలన భూమిలో ఉండే కోటాను కోట్ల సూక్ష్మ జీవులు కాలిపోవటం జరుగుతుంది. భూసార తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించటం జరిగింది. ఆయిల్ పామ్ పంట పై ఉన్న సబ్సిడీలపై రైతులకు తెలిపారు. కొత్తగా సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ డ్రిప్, మొక్కలకి ఇస్తారన్నారు. ఎకరానికి నికరంగా ప్రతి ఏడాది 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చు. ఐదు ఏండ్ల తర్వాత ఆయిల్ పామ్‌లో కోకో పంట కూడా వేసుకోవచ్చు. దీనివలన అధిక లాభాలు నికరంగా ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోనే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. గేలలు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మూడు రోజుల్లో నగదు రైతు ఖాతాల్లో జమవుతుంది. ఆయిల్ పామ్ తోటలో మూడేండ్ల వరకు అంతర పంటలు వేసుకోని అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ డిక్లరేషన్ సంగతి ఏమైంది

- బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ మొయిజ్

నవతెలంగాణ-సిద్ధిపేట

ఏడాది గడుస్తున్న కాంగ్రెస్ మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని, మైనారిటీ డిక్లరేషన్ సంగతి ఏమైందని బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ మొయిజ్ మండిపడ్డారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో కొంత బడ్జెట్ కేటాయించి అది ఎంత వరకు మైనారిటీ లకు ఖర్చు చేశారో లేదో తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షతో పాటు మరో తులం బంగారం ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. మైనార్టీ విద్యార్థుల అభ్యున్నతికి కేసీఆర్ 204 మైనారిటీ గురుకులాలు ప్రామబించారని ఒక్కో విద్యార్థి పై రూ.లక్ష ఖర్చు పెట్టారన్నారు. ఇప్పుడు గురుకుల విద్యార్థులకు సరైన భోజనం అందక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మస్జీద్ ఇమామ్, మోజెన్‌లకు రూ.10 వేలు, రూ.13 వేలు జీతం ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని మండిపడ్డారు. సిద్దిపేట మైనారిటీ సమాజం అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్, నాయకులు బాబుజని, మొయిజ్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభివృద్ధిని మరిచి విగ్రహాలను మారుస్తుంది

-బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణ

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ అభివృద్ధిని మరిచి విగ్రహాలను మార్చుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణ అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లి తదితర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని బూతులు వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీ తీసుకొచ్చేందుకు ఇప్పటినుండే కసరత్తు చేస్తున్నమన్నారు. ఏ ఒక్క పథకాన్ని ప్రభుత్వం



మున్సిపల్ లో అమలు చేయలేక పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, నాయకులు మైస విజయ్, రాములు, రమేష్, శివకుమార్, రాజశేఖర్, స్వామి పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్న సంపత్

- తెలంగాణ సాంస్కృతిక సారథిలో రాని ఉద్యోగం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎదురుచూపులు

నవతెలంగాణ-నంగునూరు



ప్రజలను చైతన్య పరచడానికి ఆటపాట ఒక ఆయుధంలా పనిచేస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కలను నమ్ముకుని అన్ని రంగాల మీద అవగాహన తెచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాడు ఒక కళాకారుడు. నంగునూరు మండలం ఖాతా గ్రామానికి చెందిన ఉగ్గి సంపత్ నిరుపేద కుటుంబానికి చెందినవాడు. సంపత్ పాటలు అంటే ఎంతో ఆసక్తి పాఠశాలలో చదువుతున్న సమయంలోనే అనేక కార్యక్రమాల్లో తన పాటలతో అందరినీ మెప్పించాడు .2001లో ఇంటర్ చదివే సమయంలో కొత్తగా ప్రారంభమైన చైతన్య కళా సమితి సంపత్ కు వేదికగా మారింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 14 ఏండ్లు తన పాటలతో అనేక కార్యక్రమాల్లోని వేదికల పైన ప్రజలను ఉత్తేజ పరుస్తూ తెలంగాణ ఆవిర్భావానికి తన వంతు కృషి చేశాడు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య అధ్యక్షురాలు విమలక్క, ప్రజాకవి గోరటి వెంకన్న, అందెశ్రీ వంటి వారి సమక్షంలో రాష్ట్రాల్లో పలుచోట్ల 800 పైగా ప్రదేశంలో ఇచ్చినాడు. చైతన్య కళా సమితిలో సంపత్ కళాబృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించిన ఉమ్మడి



ఆంధ్రప్రదేశ్ దళిత కళామండలి వీరిని ప్రత్యేకంగా అభినందించింది. అప్పటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా 2011 సెప్టెంబర్ 7న రవీంద్రభారతిలో ట్రూ ఇండియన్ ఫెలోషిప్ అవార్డును అందించి సత్కరించింది. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ విజయశాంతి, దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి, చేర్యాల ఎమ్మెల్యేలు కొమ్మూరు ప్రతాపరెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తదితరుల చేత శభాష్ అనిపించుకున్నాడు. స్థానిక టీవీ ఛానల్ లో నిర్వహించిన మా పల్లె జానపదం కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబరిచి ప్రేక్షకుల మన్నలను సైతం పొందాడు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్, గుజరాత్, పంజాబ్ లాంటి పలు రాష్ట్రాల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి కళా ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ కళాకారులను గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారధిలో 550 మందికి ఉద్యోగాలు కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారధిలో సంపత్‌కు చోటు కల్పించకపోవడం దురదృష్టకరం. కుటుంబ భారంతో భార్యా పిల్లల్ని పోషించడానికి కుటుంబాన్ని వదిలి ప్రస్తుతం హైదరాబాదులో కారు డ్రైవర్‌గా తన జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తనకు ఉద్యోగం వస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నాడు.